ఉచిత వైద్య శిబిరం

ఆర్కేపురం, ఏప్రిల్ 6 : ఉచిత వైద్య శిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని సత్యం హోమియోపతి చైర్మన్ గుజ్జ సత్యం అన్నారు. శనివారం కొత్తపేట డాక్టర్స్ కాలనీలోని లక్ష్మివైట్ హౌస్ షాపింగ్ కాంప్లెక్స్‌లో సత్యం హోమియోపతి ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంపును లక్ష్మి వైట్ హౌస్ షాపింగ్ కాంప్లెక్స్ మేనేజింగ్ డైరెక్టర్ తడక భాస్కర్, పెద్ది జగదీశ్, గుజ్జ సత్యం ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ కార్పొరేట్ హోమియోపతి అందరికి అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో 5 సంవత్సరాల క్రితం మొదటి బ్రాంచ్‌ను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అందరికీ ఉచిత డాక్టర్ కన్సల్టేషన్‌తో పాటు ఉచిత మందులను నెల రోజుల పాటు సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 912121 8585కు నంబర్‌ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ డైరెక్టర్ డాక్టర్ రాజేశ్, పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం

రామంతాపూర్, ఏప్రిల్ 6: ఉప్పల్ మినీ శిల్పారామంలో శనివారం విశ్వప్రభ బృందంచే కూచిపూడి నృత్యం ఎంతగానో అలరించింది. కస్తూరి తిలకం , గురుబ్రహ్మ, గజానన, అంగికం, భవనం, వినాయక కౌతం, కొలువైతినా, జతిస్వరం, కృష్ణ, కలయసఖీ, బ్రహ్మాంజలి, దశావతార, తదితర కీర్తనలు అలరించాయి. కార్యక్రమంలో విదిష, సాన్విక, యువిన, ప్రణవి, లక్ష్మి ప్రియా, వసుధ, సంజన, రుచిక, సహస్ర, నిత్య పాల్గొన్నారు.

రైతు వ్యతిరేకి కాంగ్రెస్ సర్కార్

- పంటలు ఎండుతున్నా పట్టించుకోరా..
- రైతుల ఆత్మహత్యలు ప్రభుత్వానికి పట్టదా..
- నిరసన వ్యక్తం చేసిన అన్నదాతలు



కందుకూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

కందుకూరు. ఏప్రిల్ 6 : రాష్ట్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయం నుంచి హైదరాబాద్, శ్రీశైలం రహదారిపై ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి నిరసన తెలిపి అనంతరం ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. రూ. 500ల బోనస్‌ను ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగాపురం లక్ష్మీనర్సింహారెడ్డి ఏజీ అంజయ్య గౌడ్. ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, గుయ్యని సామయ్య, మేఘనాథ్‌రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు తాండ్ర ఇందిరమ్మ దేవేందర్, మాజీ జడ్పీటీసీ పెద్ద రామయ్య, మాజీ సర్పంచ్‌లు గంగాపురం గోపాల్‌రెడ్డి,శేఖర్ గుప్తా, సామ మహేందర్‌రెడ్డి, దామోదర్‌గౌడ్, సురుసాని శేఖర్‌రెడ్డి, యూత్ నాయకులు తాళ్ల కార్తీక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, బర్కం వెంకటేశ్. అశోక్, రామకృష్ణ, పారిజాతం, కొండల్‌రెడ్డి, సామ ప్రకాశ్‌రెడ్డి, దేవీలాల్‌నాయక్, అలీ జంగయ్య, పాండురంగారెడ్డి. హన్మంత్‌రెడ్డి, బాబయ్య, రామాంజనేయులు, క్రిష్ణారెడ్డి, పాండురంగారెడ్డి, జంగయ్య, శ్రీహరి, లక్ష్మణ చారి, జంగయ్య పాల్గొన్నారు.



మహేశ్వరంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రైతుల పాలిట శాపంగా ప్రభుత్వం...

బడంగ్‌పేట, ఏప్రిల్6: రైతుల సమస్యలను కాంగ్రెస్ పార్టీ గాలికి వదిలేసి పట్టించు కోపడం లేదని మహేశ్వరం మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రాజు నాయక్ ఆరోపించారు. శనివారం రైతుల సమస్యలను పరిష్కరించాలని మహేశ్వరం మండల తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి నిరసన తెలిపారు. పంటలు ఎండిపోతున్నాయని ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఎవరూ వినడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పంటకు నీళ్లు లేవు, కరెంటు కోతలతో రైతు ఆగం అవుతున్నాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన్నప్పటి నుంచి రైతులకు శాపంగా మారిందన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఎందుకు రెండు లక్షల రుణమాఫీ చేయలేదని ఆయన ప్రశ్నించారు. ఐదు వందలకు గ్యాస్ ఇస్తామని ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. తప్పుడు వాగ్దానాలు చేసుడు తప్ప పనిచేయడం లేదన్నారు. కౌలు రైతుకు రూ.12 వేలు ఇస్తామని చెప్పి ఎందుకు ఇవ్వడం లేదన్నారు. రైతులకు 24గంటల కరెంటు పత్తాలేదన్నారు. పంట నష్టపోయిన రైతుకు ఎకరాకు రూ.25 వేలు ఇవ్వాలన్నారు. నాయకులు చంద్రయ్య ముదిరాజ్, డీసీసీ చైర్మన్ పాండు యాదవ్, వెంకటేశ్వర్ రెడ్డి, వైస్ చైర్మన్, డైరెక్టర్ రవీందర్, క్రిష్ణ, సీతారాం నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అనాథ గృహం నిర్వహించడం అభినందనీయం

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఆర్కేపురం, ఏప్రిల్ 6 : అనాథ విద్యార్థి గృహం ఒక దేవాలయమని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ చిత్రలేఅవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహ గ్రౌండ్ ఫ్లోర్‌లో నూతనంగా నిర్మించిన 14 వాష్ రూమ్స్, అధునాతన హేయిర్ కటింగ్ సెలూన్, వాషింగ్ మిషన్స్‌లను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఉద్యోగులను పెట్టకుండా ఎవరికీ జీతాలు లేకుండా హాస్టల్‌లో అన్ని బాధ్యతలను మార్గం రాజేశ్ నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పద్మజ, శశిమోహన్, ప్రసన్న దేవి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

మణికొండ, ఏప్రిల్ 6: పెరుగుతున్న ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మర్రిచెట్టు సర్కిల్ వద్ద బిల్డర్ వెంకటేశ్ ఆధ్వర్యం లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారన్నారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినం దనీయమన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

వనస్థలిపురం, ఏప్రిల్ 6 : చలివేంద్రాలను ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తి తీర్చడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సామాజిక వేత్త గద్దె విజయ్‌నేత ఆధ్వర్యంలో బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బ్యాంక్ కాలనీలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వేసవిలో విజయ్‌నేత ఎన్నోచోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేస్తారన్నారు. వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దుబాయ్ రాజు, శేఖర్, రవికుమార్, ఉపేందర్, భావన శ్రీనివాస్, మల్లేశ్, హనుమంతరావు, శ్రీకాంత్‌రెడ్డి, మనోహర్, సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యపై ఆసక్తిని పెంపొందించాలి

చిన్నారుల్లో విద్యపై భయాలను తొలగించి ఆసక్తిని పెంపొందించాలని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి అన్నారు. హస్తినాపురంలోని నాగార్జున స్కూల్‌లో శనివారం చిన్నారులకు స్నాతకోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్నతనం నుంచే విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తున్నామన్నారు. చదువుతోపాటు క్రీడా, సాంస్కృతిక అంశాలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. చిన్నారులో మానసిక, శారీరక వికాసం పెంపొందించేలా తరగతులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాగార్జున విద్యా సంస్థల వైస్ చైర్‌పర్సన్ గుమ్మకొండ రజనీ విఠల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, సవిత, పుష్పలత, అరుణ, దివ్య, ప్రియాంక, ఉషశ్రీ పాల్గొన్నారు. – వనస్థలిపురం

బారికేడ్లకు రేడియం స్టిక్కర్లు

ఎల్బీనగర్ , ఏప్రిల్ 6: నాగోలు చౌరస్తాలో ఏర్పాటు చేసిన బారికేడ్లతో రాత్రి సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్న వైనంపై నమస్తే తెలంగాణ దినపత్రికలో వచ్చిన 'బారికేడ్లతో ప్రమాదాలు ' కథనానికి అధికారులు స్పందించారు. నాగోలు చౌరస్తా ప్రాంతంలో బారికేడ్లకు రేడియం స్టిక్కర్లు లేక ప్రమాదాలకు కారణం అవుతున్న బారికేడ్లకు రేడియం స్టిక్కర్లతో బోర్డును ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికులు, వాహనచోదకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడాలి



విజ్ఞాన్ కళాశాల కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బండ్లగూడ, ఏప్రిల్ 6 : విద్యార్థి దశ నుంచి దేశ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడే బాధ్యత నేటి విద్యార్థులపై ఉందని విజ్ఞాన్ కళాశాలల చైర్మన్ గౌరీ సతీశ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విజ్ఞాన్ కళాశాలలో ఉగాది పండుగ సందర్భంగా సాంస్కృతిక దినోత్సవాన్ని నిర్వహించారు. డిగ్రీ ఫైనల్ఇయర్ విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం గౌరీ సతీశ్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో విద్యార్థులు తెలుగు పండుగల గురించి తెలుసుకోవడంతో పాటు తెలుగు సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఉగాది రోజున చేసే పచ్చడిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.

కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, అధ్యాపకులు శ్రీలత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

జనజాతర సభకు తరలిన నేతలు

మన్సూరాబాద్, ఏప్రిల్ 6: తుక్కుగూడలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జనజాతర సభకు మన్సూరాబాద్ డివిజన్ పరిధి నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ జెండా ఊపి బస్సు యాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి జాలె వెంకట్‌రెడ్డి, కార్యదర్శి సుధాకర్, మన్సూరాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బుడ్డ సత్యనారాయణ, నాయకులు ఇరిగి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్కేపురం: జన జాతర మహా సభకు సరూర్‌నగర్ డివిజన్ నుంచి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బేర బాలకిషన్, ఆకుల అరవింద్ కుమార్,బోయిని శంకర్, నల్లకిందన్ రాజ్‌గౌడ్, చిక్కుళ శివ ప్రసాద్, షఫీ, భాస్కర్ కిశోర్ తదితరులు తరలివెళ్లారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

అంబర్‌పేట: గోల్నాక డివిజన్ అశోక్‌నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ (జంక్షన్) వద్ద శనివారం మధ్యాహ్నం మంటలు చలరేగాయి. చూసిన స్థానికులు ఫైర్ ఇంజిన్, ట్రా న్స్‌కో అధికారులకు ఫోన్ చేసి సమాచా రం అందించారు. ఘటనా స్థలానికి ట్రాన్స్‌కో ఏఈ ప్రసాద్, డీఈ సీనయ్య సిబ్బందితో వచ్చారు. అప్పటికే చు ట్టూ ఉన్న వైర్లు కాలిపోయాయి. ఫైర్ ఇం జిన్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. బీఆర్ఎస్ నాయకులు సంతోష్, దామోదర్, శ్రీనివాస్, వెంకట్, రాజేశ్, శంకర్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆదేశాల మేరకు అక్కడకు చేరుకొని మరమ్మతులు చేయించారు.

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

కాచిగూడ, : డిగ్రీ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. కాచిగూడ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, ఎస్సై డి.సుభాష్ తెలిపిన ప్రకారం.. బర్కత్‌పురకు చెందిన నవ్యశ్రీ (20) కేశవ మెమోరియల్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇ యర్ చదువుతుంది. ప్రేమ విఫలమై.. మనస్థాపంతో శనివారం ప్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తె లిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బండరాళ్ల తొలగింపునకు బ్లాస్టింగ్‌లు

- జిలెటిన్ స్టిక్స్‌ను ఉపయోగించి పేలుళ్లు
- భయంగుప్పిట్లో సెంట్రల్ బ్యాంకు కాలనీవాసులు

సెంట్రల్‌బ్యాంకు కాలనీలో చేపడుతున్న వరదనీటి ట్రంక్‌లైన్ పనులు

మన్సూరాబాద్, ఏప్రిల్ 6: వరదనీటి ట్రంక్‌లైన్ ఏర్పాటు పనులకు అడ్డుగా వస్తున్న బండరాళ్లను తొలగించేందుకు జిలెటిన్ స్టిక్స్‌ను ఉపయోగించి జరుపుతున్న పేలుళ్లతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. జనావాసాల మధ్యన ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోకుండా బ్లాస్టింగ్‌లు చేపట్టడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధి సెంట్రల్‌బ్యాంకు కాలనీలోని కాకతీయ స్కూల్ వద్ద నుంచి చంద్రపురికాలనీలోని చంద్రనివాస్ అపార్ట్‌మెంట్ వరకు రూ. 1.90 కోట్లతో 1.3 కిలోమీటరు మేర వరదనీటి కాలువ ట్రంక్‌లైన్ పనులను కొన్ని రోజులుగా నిర్వహిస్తున్నారు. వరదనీటి కాలువ ట్రంక్‌లైన్ పనులకు బండరాళ్లు అడ్డు వస్తుండటంతో వాటిని తొలగించేందుకు జిలెటిన్ స్టిక్స్ ఉపయోగించి పేలుళ్లు జరుపుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ పేలుళ్లతో బండరాళ్లు వచ్చి రోడ్లపైనే కాకుండా పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇండ్లపై పడుతున్నాయి. అంతే కాకుండా బ్లాస్టింగ్‌ల తాకిడికి పక్కనే ఉన్న ఇండ్ల కిటికీ అద్దాలు పగలడమే కాకుండా గోడలకు పగుళ్లు ఏర్పడుతున్నాయి. శనివారం మధ్యహ్నం సమయంలో సెంట్రల్ బ్యాంకు కాలనీలోని కమ్యూనిటీ హాల్ ఎదురుగా రోడ్డు నెం. 1లో వరదనీటి కాలువలో అడ్డుగా వచ్చిన బండరాళ్లన తొలగించేందుకు జిలెటిన్ స్టిక్స్ ఉపయోగించి జరిపిన పేలుళ్లకు ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఎలాంటి ముందస్తు భద్రతాచర్యలు తీసుకోకుండా జనావాసాల మధ్యన చేపడుతున్న బ్లాస్టింగ్‌లతో ఇండ్లు దెబ్బతినడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. జిలెటిన్ స్టిక్స్‌ను ఉపయోగించి పేలుళ్లు జరుపకుండా వేరే ఇతర మార్గాల్లో బండరాళ్లను తొలగించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నోటీసులు ఇచ్చాం

సెంట్రల్‌బ్యాంకు కాలనీలోని కమ్యూనిటీ హాల్ ఎదురుగా వరదనీటి కాలువ పనులకు అడ్డుగా వచ్చిన బండరాళ్లను తొలగించేందుకు బ్లాస్టింగ్ జరిపిన కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇచ్చాం. జిలెటిన్ స్టిక్స్‌ను ఉపయోగించి బండరాళ్లను తొలగించేందుకు బ్లాస్టింగ్ చేయడం నేరం. నిబంధనలు పాటించని కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటాం. కంప్రెషర్ లేదా హిటాచి మిషన్‌తో బండరాళ్లను బ్రేక్ చేయాలి. ప్రజలను ప్రమాదాలకు గురి చేయడం సరి కాదు.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈ

దాహార్తిని తీర్చేందుకు.. చలివేంద్రాలు

కార్పొరేటర్ పద్మావెంకటరెడ్డితో కలిసి చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, ఏప్రిల్ 6 : ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. ధర్మశాస్తా సేవా సంఘం వ్యవస్థాపకులు ఎం. చంద్రమౌళి గురుస్వామి, ఎన్.స్వామిల ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేట గురువాయూర్ శ్రీకృష్ణ మందిర్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి అవసరమైన చోట చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.సాంబశివగౌడ్, సంస్థ ప్రతినిధులు నర్సింగ్‌రావు, సత్యనారాయణ, యాదగిరి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, నాయకులు మిర్యాల శ్రీను, వెంకట రమణ రాజు, టి.రమేశ్, కోట్ల సంతోష్, నరహరి, శ్రీహరి పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

మణికొండ, ఏప్రిల్ 6: రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు ప్రాముఖ్యాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకొని, ఉపయోగించుకోవాలని స్వీప్ నోడల్ ఆఫీసర్, బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. శనివారం మణికొండ మున్సిపల్ కార్యాలయం నుంచి గోల్డెన్ టెంపుల్ వరకు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ.. మానవహారం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓటు అనే ఆయుధాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వందశాతం ఉపయోగించుకునేలా అవగాహన చేపడుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఈ సాయి మౌనిక, ఈఈ సంపత్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

మలక్‌పేట, ఏప్రిల్ 6: రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు పని చేయాలని బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి కొంపల్లి మాధవీలత పిలుపునిచ్చారు. బీజేపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సలీంనగర్ చౌరస్తాలోని బీజేపీ మూసారాంబాగ్ డివిజన్ పార్టీ కార్యాలయంవద్ద కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిఆధ్వర్యంలో నిర్వహించిన ఆవిర్భావ దినోత్సవానిక ఆమె ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు.

ఆర్కేపురం: నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో దూసుకెళ్తుందని మాజీ కౌన్సిలర్ స్వరూపగౌడ్ అన్నారు. శనివారం సరూర్‌నగర్ డివిజన్ హుడా కాంప్లెక్స్‌లో భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె హాజరై బీజేపీ జెండాను ఎగరవేశారు.

సైదాబాద్: మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాల్లో బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. సైదాబాద్ రెడ్డిబస్తీలో ఏర్పాటు చేసిన బీజేపీ జెండాను హైదరాబాద్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి హాజరై ఆవిష్కరించారు.

నీటి ఎద్దడిని నివారించాలి

బండ్లగూడ, ఏప్రిల్ 6: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలకు మంచినీటి ఎద్దడి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని జలమండలి లైన్‌మెన్లను బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర ఆదేశించారు. శనివారం ఆయన కార్పొరేషన్ కార్యాలయంలో వివిధ విభాగాల సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధిలో భూగర్భ జాలలు అడుగంటడంతో నీటి ఇబ్బందులు తప్పడం లేదని అన్నారు. జలమండలి అధికారులు స్పందించి నీటి సరఫరాను పెంచి ప్రజలకు తాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఆస్తిపన్నులో 5శాతం రాయితీని కల్పిస్తున్నట్లు చెప్పారు.